

ఆధార్ మాదిరిగా

'భూ ధార్'

● రైతుల గుర్తింపునకు ప్రత్యేక యాప్

● ఫార్మర్ రిజిస్ట్రీతో కేంద్రం కొత్త పథకం

● ఆధార్ తరహాలో సాగుదారులకు 11 అంకెల సంఖ్య

● నేటి నుంచి రైతువేదికల్లో నమోదుకు అధికారులు సిద్ధం 8

కార్లపై లారీ బోల్తా

● నుజ్జునుజ్జయిన రెండు వాహనాలు

● ఇద్దరికి స్వల్ప గాయాలు 7

మహిళా డిగ్రీ కాలేజీ హాస్టల్‌లో 20 బాత్రూమ్‌ల ఏర్పాటు

రూ.15 లక్షల సొంత నిధులతో నిర్మాణానికి జగ్గారెడ్డి నిర్ణయం

సంగారెడ్డి టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తన సొంత నిధులు రూ.15 లక్షలతో 20 బాత్రూమ్‌లు నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన పనులు తక్షణమే ప్రారంభించాలని ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఆదివారం మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్‌ను జగ్గారెడ్డి సందర్శించారు. ఈ మేరకు హాస్టల్‌లో 150 మంది విద్యార్థినులకు కేవలం పది బాత్రూమ్‌లు మాత్రమే ఉండడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని హాస్టల్ సిబ్బంది జగ్గారెడ్డికి వివరించారు. ఇందుకు వెంటనే స్పందించిన జగ్గారెడ్డి తన సొంత నిధులు రూ.15 లక్షలతో 20 బాత్రూమ్‌లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. జగ్గారెడ్డి మాట్లాడుతూ సెలవుల అనంతరం తిరిగి హాస్టల్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో తక్షణమే పనులు ప్రారంభించాలని ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. హాస్టల్‌లో ఇప్పుడున్న బాత్రూమ్‌లకు అదనంగా మరో ఇరువై బాత్రూమ్‌లు ఏర్పాటు చేయడం పట్ల హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు తోపాజి అనంతకిషన్, కూన సంతోష్, షఫీ హఫీజ్, కిరణ్ గౌడ్, మహేష్‌తోపాటు ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ డీఈ రాజు, ఏఈలు రాజమల్లయ్య, లక్ష్మీకాంత్ ఉన్నారు.





సంగారెడ్డిలోని మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్ విద్యార్థినుల కోసం నిర్మించ తలపెట్టిన బాత్రూమ్‌ల స్థలాన్ని పరిశీలిస్తున్న జగ్గారెడ్డి

హాస్టల్ సిబ్బందికి సూచనలిస్తున్న జగ్గారెడ్డి

తరుగు పేరుతో దోపిడీ

● దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, మే 4 (ఆంధ్రజ్యోతి) : మిల్లర్లు, కొన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరుగు ఎంత తీస్తున్నారో అధికారులకు తెలియడం లేదని దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. ఇప్పటి వరకు కనీస వసతులు కల్పించిన దాఖలాలు లేవని ఆయన మండిపడ్డారు. ఆదివారం ఆయన దుబ్బాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 130 మందికి సీఎం సహాయనిధి చెక్కులను అందజేసి మాట్లాడారు. రైతులు వడగళ్ల వానతో తీవ్రంగా నష్టపోయారని, మిగిలిన ధాన్యాన్ని అయినా సక్రమంగా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆశిస్తే కనీస వసతులు కూడా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లలో అవకతవకలు జరగవని మంత్రి పొంగులేటి చెబుతన్నా క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉందన్నారు. దుబ్బాక, మిరుదొడ్డి ఎస్సైలు విచ్చలవిడిగా లంచాలు తీసుకుంటున్నారని, ఇందులో మిరుదొడ్డిలో హోంగార్డును బలిపశువును చేశారన్నారు. అనంతరం మండలంలోని రఘోత్తంపల్లిలో రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆయన వెంట రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, నాయకులు ఆర్.రాజమౌళి, రణం శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, పలువురు ఉన్నారు.

భక్తజనసందోహం

చేర్యాల, మే 4 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ సందర్శనార్థం ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే బీసీసీఐ, హెచ్‌సీఏ పిచ్ క్యూరేటర్ వైఎస్ చంద్రశేఖర్ ఆదివారం మల్లన్న ఆలయాన్ని సందర్శించి అర్చన, అభిషేకం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆశీర్వాద మండపంలో ఆలయ సూపరింటెండెంట్ సురేందర్‌రెడ్డి శేషవస్త్రం అందించగా, ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్ వేదాశీర్వచనం అందించారు.

దాదాపు గంటన్నరకు పైగా సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా కురిసిన అకాల వర్షం అంతా అతలాకుతలం చేసింది. ఆదివారం సాయంత్రం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరదనీరు ముంచెత్తింది. రైతులు మార్కెట్ యార్డుకు ధాన్యం తరలించగా, ఒక్కసారిగా కురిసిన వర్షానికి పలు ధాన్యం తడిసిముద్దయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మార్కెట్ యార్డుకు తరలిస్తే, అకాల వర్షంతో నష్టపోయామంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు మామిడికాయలు రాలిపోవడం, వరి కోతకు సిద్ధమైన తరుణంలో చేతికొచ్చిన పంట వర్షానికి నేలకొరగడంతో అన్నదాతలు ఆగమవుతున్నారు.

- సిద్దిపేట ఆంధ్రజ్యోతి/ న్యూస్‌నెట్‌వర్క్ మే 4

బీభత్సం

జిల్లాలో భారీ వర్షం - మార్కెట్ యార్డుల్లో తడిసిన ధాన్యం

● పలు చోట్ల ధ్వంసమైన ఇంటి పైకప్పు రేకులు ● నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు

● గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం



సిద్దిపేట మార్కెట్ యార్డులో నీటిలో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళా రైతు



జిల్లాలోని పలు ప్రాంతాల్లో వీచిన భారీ ఈదురుగాలులు, వర్షానికి విద్యుత్ స్థంబాలు, భారీ వృక్షాలు నేలకొరిగాయి. పలు చోట్ల ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. జిల్లాలో చాలా చోట్ల విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వడగళ్ల వాన వల్ల అన్నదాతలు కుదేలయ్యారు.

జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో వర్షం బీభత్సం సృష్టించింది. జిల్లాలోని సిద్దిపేట, తొగుట, మిరుదొడ్డి, బెజ్జంకి, సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట, కుకునూరుపల్లి, సిద్దిపేట అర్బన్, నంగునూర్, కొండపాక, దుబ్బాక, మండలంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అక్బర్‌పేట-భూంపల్లి, మండలాల్లోని వివిధ గ్రామాల్లో, సిద్దిపేట రూరల్‌లోని వెంకటాపూర్, బుస్సాపూర్ గ్రామాల్లో వడగండ్ల వర్షం పడింది. సిద్దిపేట, దుబ్బాక మార్కెట్ యార్డు, వెంకటాపూర్, చిన్నగుండవెల్లి, మద్దూరు, దుద్దెడ, నంగునూరు, చిన్నకోడూరు, ధూళిమిట్ట మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిపోయింది. తొగుట మార్కెట్ యార్డులో వర్షానికి ధాన్యం కొట్టుకుపోయింది. మిరుదొడ్డి మండలం లింగుపల్లిలో ఈదురు గాలులు, వర్షానికి రేకులు ధ్వంసమయ్యాయి. నంగునూర్‌లో, తుక్కాపూర్ తొగుట రోడ్డుపై, గాజులపల్లిలో, ఇందూర్ కళాశాల వద్ద రోడ్డుపై, కోహెడ నుంచి కరీంనగర్ రహదారిపై భారీ వృక్షాలు నేల కొరిగాయి. వాహనదారులకు ఇబ్బందిగా మారింది. తొగుటలో చెట్టు విరిగి ఆటోపై పడింది. దీంతో అధికారులు, పోలీసులు పలుచోట్ల జేసీబీ సహాయంతో పక్కకు తప్పించారు. వెంకట్రావుపేటలో, తుక్కాపూర్‌లో, మిరుదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామంలో, సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో ఈదురుగాలులకు పాఠశాల ప్రహరీ గోడపై





విద్యుత్ స్థంభాలు నెలకొరిగాయి. చాలాచోట్ల విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దుద్దెడ వద్ద నున్న టోల్ ప్లాజా వద్ద టాప్ షీట్లు కూలి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. కోహెడ మండలం తీగలకుంటపల్లిలో మామిడికాయలు నెలరాలాయి. చిన్నకోడూర్‌లోని కిష్టాపూర్‌లో రైతు చక్రాల బాల్‌రాజు వ్యవసాయ బావి వద్ద కట్టేసిన రెండు ఎద్దులు పిడుగు పాటుకు మృతి చెందగా, రూ. లక్ష మేర నష్టం జరిగిందని వాపోయారు. ఈదురు గాలులకు నంగునూరు మండలం నర్మెట గ్రామంలోని అఖిల ఫంక్షన్‌హాల్, వేణుకు చెందిన హోటల్ రేకులు ఎగిరిపోయాయి.

మరికొన్ని దృశ్యాలు 7



సిద్దిపేట మార్కెట్ యార్డులో వరదలో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు



మద్దూరులోని కొనుగోలు కేంద్రంలో ధాన్యంపై టార్పాలిన్ కవర్లు కప్పుతున్న రైతు



దుబ్బాక మార్కెట్‌యార్డులో వర్షం నీటిలో కొట్టుకుపోతున్న ధాన్యం



తొగుట - తుక్కాపూర్ రోడ్డుపై విరిగిపడిన చెట్టును జేసీబీ సహాయంతో తొలగిస్తున్న పోలీసులు

ఉమ్మడి జిల్లాలో భిన్న వాతావరణం

● మధ్యాహ్నం వరకు సుర్రుమన్న సూర్యుడు

● సాయంత్రం ఈదురుగాలుతో కూడిన వర్షం

● చేర్యాల మండలం

చిట్యాలలో 43.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

సిద్దిపేట ఆంధ్రజ్యోతి/కోహీర్, మే 4: ఉమ్మడి జిల్లాలో భిన్నమైన వాతావరణం నెలకొన్నది. ఆదివారం మధ్యాహ్నం వరకు ఎండ సుర్రుమనిపించగా, సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. ఉదయం 9 నుంచి భానుడి భగభగలు మొదలవగా, మధ్యాహ్నం తర్వాత ఆకాశం మేఘావృతం కావడంతో సూర్యుడు మబ్బులచాటుకు వెళ్లాడు. ఉమ్మడి జిల్లాలోని 108 ప్రాంతాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని చిట్యాలలో 43.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మెదక్ జిల్లాలోని శంకరంపేట్(ఏ)లో 43.4 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా నిజాంపేట్‌లో 42.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సిద్దిపేట జిల్లాలో...

చిట్యాల 43.6, పోతరెడ్డిపేట 43.4, రేబర్తి 43.3, బెజ్జంకి 43.2, కోహెడ 43.1, సముద్రాల 43.1, రాఘవపూర్ 43.0 సిద్దిపేట 42.9, హస్నాబాద్ 42.7, నంగనూరు 42.7, అబ్బిపూర్ 42.4, శనిగరం 42.4, నారాయణరావుపేట్ 43.3, దూల్మిట్ట 42.2, తుక్కాపూర్ 42.2, బేగంపేట్ 42.0, గండిపల్లి 41.9, చీకోడు 41.8, కట్కూర్ 41.7, పెద్దకోడూరు 41.6, కొండపాక 41.5, గజ్వేల్ 41.5, మిరుదొడ్డి 41.3, బెజుగావ్ 41.0, తిప్పారం 40.9, గౌరారం 40.7, అంగడికిష్టాపూర్ 40.7, వెంకటరావుపేట్ 40.6, రాంపూర్ 40.6, ముస్త్యాల 40.5,, చెట్లపల్లి 40.5, దౌల్తాబాద్ 40.4, మునిగండప్ప40.3, కొమురవెల్లి 40.3 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ప్రశాంతంగా నీట్

● 857 మంది విద్యార్థులు హాజరు

సిద్దిపేట కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం జిల్లా కేంద్రంలో రెండు సెంటర్లలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్ష 883 మంది విద్యార్థులకు గానూ 857 మంది విద్యార్థులు హాజరయ్యారు. 26 మంది విద్యార్థులు గైరాజరయ్యారు. నిమిషం నిబంధన కారణంగా ముగ్గురిని అధికారులు పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. ఆదిలాబాద్, హైదరాబాద్, నంగునూర్ నుండి వచ్చిన ముగ్గురు విద్యార్థినులు పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా చేరుకోవడంతో వారిని అధికారులు అనుమతినివ్వలేదు. రెండు పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన సెంటర్లను కలెక్టర్ మను చౌదరి, అడిషనల్ కలెక్టర్, నీట్ పరీక్ష జిల్లా నోడల్ ఆఫీసర్ గరిమా అగ్రవాల్ వేర్వేరుగా పరీక్ష కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికతో నీట్ పరీక్షను జిల్లాలో విజయవంతంగా నిర్వహించిన్నట్లు తెలిపారు. రెండు పరీక్ష కేంద్రాలలో సిద్దిపేట, గజ్వేల్ ఆర్డీవోలను డ్యూటీ మెజిస్ట్రేట్లుగా నియమించి పర్యవేక్షించిన్నట్లు తెలిపారు. అదేవిధంగా అడిషనల్ డీసీపీ సిద్దిపేట ఏసీపీ నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పరీక్ష విజయవంతంగా ముగిసిందని పరీక్ష నిర్వహణలో పాల్గొన్న అధికారులకు అందరికీ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు.



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



ముగిసిన ఎప్‌సెట్ పరీక్షలు

ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన టీజీ ఎప్ సెట్ పరీక్షలు ఆదివారం ముగిశాయి. 5 రోజుల పాటు జరిగిన పరీక్షలు రెండు సెషన్‌లో నిర్వహించారు. చివరి రోజు ఆదివారం జరిగిన పరీక్షకు రెండు పరీక్ష కేంద్రాల్లో మొదటి సెషన్‌లో 205 మంది విద్యార్థులకు గాను 18 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. రెండవ సెషన్‌లో 205 మంది విద్యార్థులకు గాను 13 మంది గైర్హాజరయ్యారు.



చెవి కమ్మలు, కాళ్ల పట్టీలు తీస్తున్న విద్యార్థులు

సాగర్‌లో చావుకేకలు



రంగనాయకసాగర్‌లో పర్యాటకులు (ఇన్‌సెట్‌లో పోలీసుల హెచ్చరిక బోర్డు)

● రంగనాయక సాగర్ రిజర్వాయర్‌పై నిఘా ఏదీ?

● సెలవుల కారణంగా పెరుగుతున్న పర్యాటకులు

● నీళ్లలో దిగి జలకాలాటలు

● గతంలో 15 మంది..తాజాగా ఇద్దరు దుర్మరణం

● అయినా మరుసటి రోజే సెల్ఫీలు, ఫొటోషూట్లు

● హెచ్చరిక బోర్డులున్నా బేఖాతర్

"పర్యాటక విహారం కోసం శనివారం వరంగల్ నుంచి రంగనాయకసాగర్‌కు వచ్చిన ఓ కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. రిజర్వాయర్‌లో స్నానం చేసేందుకు దిగిన మెహరాజ్ అనే అమ్మాయి, అర్బాస్ అనే అబ్బాయి గల్లంతయ్యారు. చివరకు వారి మృతదేహాలే బయటపడ్డాయి. నిఘా లేకపోవడం, హెచ్చరికలు కానరానందునే ఈ ఘటన చోటుచేసుకున్నట్లుగా తెలుస్తోంది. ఇది మరువకముందే మరుసటి రోజు ఆదివారం మరింత మంది పర్యాటకులు రిజర్వాయర్‌లో దిగారు. సెల్ఫీలు, ఫొటోషూట్లతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ జలకాలాటల్లో నిమగ్నమయ్యారు."

- ఆంధ్రజ్యోతి, ప్రతినిధి, సిద్దిపేట, మే 4

రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లో శనివారం ఇద్దరు దుర్మరణం చెందిన నేపథ్యంలో కఠినంగా వ్యవహరించాల్సిన పోలీసులు, అధికారులు ఆ దిశగా కన్నెత్తి చూడలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆదివారం పెద్దసంఖ్యలో పర్యాటకులు వస్తారని తెలిసినప్పటికీ తగిన జాగ్రత్తలు తీసుకోలేదు. పర్యాటకులు అడ్డూఅదుపు లేకుండా ప్రమాదకర హెచ్చరికలను దాటుతూ నీళ్లలో దిగారు. పిల్లలను సైతం నీటిలోకి దింపడం కనిపించింది.

నీళ్లలోనే సెల్ఫీలు..ఫొటోషూట్లు

రిజర్వాయర్లలోని నీళ్లను చూసేందుకు వచ్చిన పర్యాటకులు నిబంధనలకు విరుద్ధంగా నీళ్లలో దిగుతున్నారు. ఈతలు కొడుతూ, స్నానాలు చేస్తూ జలకాలాటల్లో మునుగుతున్నారు. ఇంకొందరైతే నీటిగట్ల మీద నిలబడి సెల్ఫీలు దిగుతున్నారు. మరికొందరు ఏకంగా నీళ్లలోనే ఫొటోషూట్లు చేస్తున్నారు. నీళ్లలో దిగిన ఆనందంలో కేరింతలు కొడుతూ మైమరిచిపోతున్నారు. ప్రమాదకరంగా ఉన్న రిజర్వాయర్ ఒడ్డును దాటుతూ రాళ్లపై పరుగులు పెడుతున్నారు. ఇలాంటి క్రమంలోనే కొద్ది రోజుల క్రితం కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్‌లో ఐదుగురు యువకులు గల్లంతై చనిపోయారు. అయినప్పటికీ నియంత్రణ లేకుండాపోయింది.



నీట మునిగిన వ్యక్తికి బయటకు తీసుకొస్తున్న దృశ్యం (ఫైల్)



నీటిలో స్నానం చేస్తున్న చిన్నారులు (ఫైల్)

ఇప్పటికే 15 మంది గల్లంతు..

రంగనాయకసాగర్ రిజర్వాయర్ నిర్మించిన నాటి నుంచి ఇప్పటి వరకు 15 మంది వరకు గల్లంతై చనిపోయారు. సెల్ఫీలు, ఫొటోలు దిగే క్రమంలో కొందరు, ఈత కొట్టేందుకు నీటిలో దిగి ఇంకొందరు దుర్మరణం చెందారు. తాజాగా ఓ అబ్బాయి, అమ్మాయి సైతం నీటిని అంచనా వేయకుండా రిజర్వాయర్‌లో స్నానం చేయడానికి దిగడంతో వారి ప్రాణాలు నీళ్లలోనే కలిసిపోయాయి.

మిగతా 8లో..

టీఎంవోపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జగదీశ్వర్


దాస జగదీశ్వర్

ములుగు, మే 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మీ సేవా ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిద్దిపేట జిల్లా ములుగుకు చెందిన దాస జగదీశ్వర్ నియమితులయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల జీవన ప్రసాద్ జగదీశ్వర్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ మీసేవా ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడికి, సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్మిక హక్కులను సాధించుకుందాం

- 20న సమ్మె కేంద్రంపై యుద్ధమే
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

రామాయంపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి కార్మికుల హక్కులను సాధించుకుందామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. అందుకోసం ఈ నెల 20న సార్వత్రిక సమ్మెతో యుద్ధభేరి మోగిద్దామని పిలుపునిచ్చారు. రామయంపేటలో ఆదివారం సీఐటీయూ జిల్లా మహాసభల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అడ్డగోలుగా జీఎస్టీ రుద్దుతూ సామాన్యులపై ధరల భారం మోపుతోందని విమర్శించారు. ఓవైపు అంతర్జాతీయంగా ముడి చమురు ధర తగ్గినా పెట్రోల్, డీజిల్ రేట్లు తగ్గించడం లేదన్నారు. ప్రజల అనారోగ్యం వంకతో బీడీలపై ఉక్కుపాదం మోపిన కేంద్రం అదే మద్యాన్ని ఎందుకు ప్రోత్సహిస్తుందని ప్రశ్నించారు. ఈ సభలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, బాలమణి మల్లేశం, అన్నపూర్ణ, మహేందర్ రెడ్డి, నాగరాజు, యశోద యశోద పాల్గొన్నారు. కాగా, మహాసభల సందర్భంగా కార్మికుల మెగా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పాత హైవేపై భారీ ఎర్రజెండాలతో కార్మికులు కదం తొక్కడంతో ఆ ప్రాంతమంతా ఎరుపెక్కింది.


మాట్లాడుతున్న చుక్క రాములు



అగ్రహారంలో ఉద్రిక్తత

- నవవధువు ఆత్మహత్యతో బంధువుల ఆందోళన
- పోలీసు బందోబస్తు మధ్య అంత్యక్రియలు


ఆందోళన చేస్తున్న బంధువులు

చిన్నశంకరంపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారం గ్రామంలో శనివారం రాత్రి నవవధువు వట్టెం పూజ ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో ఆదివారం మృతురాలి బంధువులు ఆందోళన నిర్వహించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. పూజ మృతికి అత్తింటివారే కారణమని వెల్దుర్తి మండలం శేరిల్లా గ్రామానికి చెందిన ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తూ ఇంటి నుంచి మృతదేహాన్ని బయటకు తీయకుండా అడ్డుకున్నారు. దీంతో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ అబ్దుల్ మన్నన్, రామాయంపేట సీఐ వెంకటరాజా గౌడ్, క్లూస్ టీమ్‌తో కలిసి శవ పంచనామా నిర్వహించారు. మృతురాలి కుటుంబీకులకు న్యాయం జరిగేంతవరకు ఊరుకోబోమని పోలీసులపై తిరగబడడంతో డీఎస్పీ నచ్చజెప్పి శాంతింపజేశారు. గ్రామంలో భారీ పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. అదనపు కట్నం వేధింపులు భరించలేక పూజ ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి గంధం సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం పోలీస్ బందోబస్తు మధ్య మృతురాలి అంత్యక్రియలు పూర్తి చేశారు.


పూజ(ఫైల్)

బాల్యవివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

దుబ్బాక, మే4(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాన్ని పోలీసులు అడ్డుకున్న ఘటన దుబ్బాక మండలంలోని ఆకారం గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా లింగాపూర్ గ్రామానికి చెందిన బాలికకు ఆకారం గ్రామానికి చెందిన యువకుడితో ఆదివారం వివాహం జరిపించేందుకు సర్వం సిద్ధం చేశారు. మైనర్ కావడంతో వివాహం చేయవద్దని కామారెడ్డి జిల్లా అధికారులు పలుసార్లు సూచించినా వారు పట్టించుకోలేదు. వరుడి ఇంటి వద్ద ఆదివారం 10.05 గంటలకు వివాహం జరిపేందుకు నిర్ణయించారు. సమాచారం అందుకున్న ఐసీడీఎస్, రెవెన్యూ, పోలీసు అధికారులు అక్కడికి చేరుకుని పెళ్లిని నిలిపివేయించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఇరుకుటుంబాలను కౌన్సెలింగ్ నిర్వహించి వధువును సొంతూరుకు పంపించారు. అక్కడి అధికారులతో; మాట్లాడి నిఘా ఉంచాల్సిందిగా సూచించారు.

లక్ష్యసాధనకు మహర్షి భగీరథుడే స్ఫూర్తి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్


భగీరథ మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధనకు మహర్షి భగీరథుడే స్ఫూర్తి అని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ కొనియాడారు. ఆదివారం కలెక్టరేట్‌లో వెనుకబడిన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ జయంతి వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మహర్షి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు, బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

హవేళిఘణపూర్, మే4 (ఆంధ్రజ్యోతి) :మండలం పరిధి కూచన్‌పల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విక్రయించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని సూచించారు. వర్షానికి తడవకుండా టార్పాలిన్లు కప్పాలన్నారు. రైతులతో మాట్లాడి సమస్యలు, సౌకర్యాల గురించి తెలుసుకున్నారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా చెస్ పోటీలు


చెస్ పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులు

మెదక్ అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-7, అండర్-11 బాలబాలికల విభాగాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి చదరంగం పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. అండర్-11 బాలుర విభాగంలో ప్రథమ హర్షిత్(మెదక్), ద్వితీయ రిత్విక్(సంగారెడ్డి), తృతీయ శ్రీమాన్‌రావు(సిద్దిపేట), నాలుగో బహుమతి ఇపాన్(మెదక్), బాలికల విభాగంలో ప్రథమ జశ్వంతిక, ద్వితీయ మేఘవర్షిక(మెదక్), అండర్-7 బాలుర విభాగంలో ప్రథమ శ్రీరామ్(సంగారెడ్డి) ద్వితీయ రితీష్(సంగారెడ్డి) స్థానాలను గెలుపొందారు. ఈ పోటీలోని విజేతలు హైదరాబాద్‌లో జరిగి రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొంటారని చెస్ అసోసియేషన్ సెక్రటరీ రాజేందర్ తెలిపారు.

కెమికల్స్ చేతిపై పడి కార్మికుడికి గాయాలు

హత్నూర, మే 4 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలో విధులు నిర్వహిస్తుండగా కెమికల్స్ చేతిపై పడి కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచూనూర్ గ్రామంలో జరిగింది. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సమీర్ గత కొంత కాలంగా గుండ్లమాచూనూర్ గ్రామ శివారులోని కోవాలంట్ లాబరేటరీ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజువారి మాదిరిగానే శనివారం పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో చేతిపై కెమికల్ పడగా.. తాత్కాలిక చికిత్స చేసి వదిలేశారు. చేతిపై బుగ్గల పొడిచి వాపు వచ్చినప్పటికీ కాంట్రాక్టర్ కానీ.. పరిశ్రమ యాజమాన్యం ఎలాంటి చికిత్స చేయించలేదు. పరిశ్రమ యాజమాన్యం, కాంట్రాక్టర్ స్పందించి ఇప్పటికైనా అవసరమైన వైద్య చికిత్సలు చేయించాలని బాధితుడు కోరుతున్నాడు.


గాయాలతో కార్మికుడు

పొలానికి దారి ఇవ్వలేదని.. ఇంటికి పిలిపించి రైతుపై దాడి

కంది, మే 4 (ఆంధ్రజ్యోతి) : తన పొలానికి దారి ఇవ్వలేదని ఓ వ్యక్తి ఇంటికి పిలిపించి రైతుపై దాడిచేసిన ఘటన కందిలో ఆదివారం నిరసనలకు దారి తీసింది. బాధితుడి వివరాల ప్రకారం.. కందికి చెందిన సునీల్‌దేశ్‌ముఖ్ అదే గ్రామానికి రైతు మల్లెపల్లి కృష్ణను పొలం విషయం మాట్లాడాలని గురువారం తన ఇంటికి పిలిచాడు. తన పొలానికి దారి ఎందుకివ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సునీల్ దేశ్‌ముఖ్ కృష్ణను తిడుతూ, అతడిపై దాడికి పాల్పడ్డాడు. కృష్ణకు గాయాలు కాగా, శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో కృష్ణ ఈ విషయాన్ని దళిత సంఘ నాయకుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు బూడిదకుమార్, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు ఆదివారం కృష్ణతో కలిసి కంది అంబేడ్కర్ విగ్రహం వద్ద కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. అక్కడి నుంచి సునీల్ ఇంటికి వెళ్లి బైఠాయించారు. పోలీసులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఇక్కడే టెంట్ వేసుకుని ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎట్టకేలకు దిగివచ్చిన పోలీసులు కేసు నమోదు చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమింపజేశారు.


దాడితో ఎడమ చేతికి తగిలిన దెబ్బలను చూపుతున్న రైతు మల్లెపల్లి కృష్ణ

వర్షార్పణం



సిద్దిపేట మార్కెట్ యార్డులో నీటిలో కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళా రైతులు





నేలరాలిన మామిడి కాయలు

సిద్దిపేట జిల్లాలోని ఆదివారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం అకాల వర్షానికి తడిసి ముద్దయ్యింది. వరదలో ధాన్యం కొట్టుకుపోవడంతో అన్నదాతలు అష్టకష్టాలు పడి తిరిగి కుప్పగా పోశారు. మార్కెట్ యార్డులు, కల్లాలు, రోడ్లపై ఆరబోసిన ధాన్యం నీటిపాలైంది. మామిడికాయలు నేలరాలాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకూలాయి.

-న్యూస్ నెట్‌వర్క్, మే 4 (ఆంధ్రజ్యోతి)





దౌల్తాబాద్ : గాజులపల్లి లో ఈదురు గాలికి విరిగిన 150 ఏళ్ల చింత చెట్టు



తొగుటలో ఆటోపై కూలిన చెట్టు







వరద నీటిలో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

● మంత్రి దామోదర్ రాజనర్సింహ



మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

సంగారెడ్డి రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హామీ ఇచ్చారు. సంగారెడ్డిలో ఆదివారం పర్యటించిన ఆయనను టీయూడబ్ల్యూజే నాయకులు కలిసి జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ జర్నలిస్టుల ఆరోగ్య పథకం కొన్ని సంవత్సరాలుగా అమలు కావడంలేదన్నారు. ప్రజలు, ప్రభుత్వానికి వారధిగా ఉన్న జర్నలిస్టులకు సరైన వైద్యమందేలా చొరవచూపాలన్నారు. ఆరోగ్య పథకాన్ని కేవలం నిమ్స్‌లో అమలు చేయడంతో చాలామంది జర్నలిసుట్లకు సరైన వైద్యం అందడం లేదని వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి మాట్లాడుతూ రెండు వారల్లోగా జర్నలిసులు, ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మంత్రిని కలిసిన వారిలో జర్నలిస్టులు కృష్ణ, శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధిక్, రాష్ట్ర హౌసింగ్ కమిటీ సభ్యుడు అన్వర్, దయాల్, ఆరీఫ్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

న్యాయ విద్యార్థికి బంగారు పతకం

జహీరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి):జహీరాబాద్ పట్టణంలోని రంజోల్‌కు చెందిన న్యాయవిద్యార్థి నూరీఫాతిమా ఆదివారం బంగారు పతకం సాధించింది. జాతీయ స్థాయిలో హైదరాబాద్‌లోని వివిధ లా కళాశాలలకు చెందిన విద్యార్థులకు సుల్తాన్ ఉల్‌ము కళాశాలలో గత మూడు రోజులుగా హార్మనీ అండ్ డిస్ప్యూట్ అనే అంశంపై పోటీ పరీక్షలను నిర్వహించారు. ఇందులో జహీరాబాద్‌కు చెందిన న్యాయ విద్యార్థి నూరీఫాతిమా ప్రతిభను కనబర్చడంతో ఆదివారం హైదరాబాద్‌లో ఆమెకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నాగేశ్వరరావు బంగారు పతకాన్ని అందజేశారు.



నూరీన్ ఫాతిమా



'నీట్' సందడి

ఉమ్మడి జిల్లాలో ఆదివారం నీట్ ప్రశాంతంగా ముగిసింది. పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థుల సందడి కనిపించింది. చివరి నిమిషంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు పరీక్ష కేంద్రాల వద్దకు పరుగులు తీయడం కనిపించింది. ప్రతి విద్యార్థి నుంచి రెండు పాస్‌సైజ్ ఫోటోలను తీసుకొని, ఒరిజినల్ గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి అనుమతించారు. విద్యార్థులు ధరించిన ఆభరణాలు తీసివేయించారు.









ఓవర్ లోడ్ లారీ కార్లపై బోల్తా

● నుజ్జునుజ్జయిన రెండు కార్లు ● ఇద్దరికి స్వల్ప గాయాలు

● మానవత్వం చాటిన మాజీ మంత్రి హరీశ్‌రావు

కొండాపూర్, మే4 (ఆంధ్రజ్యోతి) : కట్టెల లోడ్‌తో వెళ్తున్న లారీ రెండు కార్లపై బోల్తా పడగా కార్లు నుజ్జునుజ్జయ్యాయి. కొండాపూర్ ఎస్ఐ భరత్ కుమార్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ పరిధిలోని 65వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం హైదరాబద్ నుంచి జహీరాబాద్ వైపు కట్టెల లోడ్‌తో వేగంగా వెళ్తున్న ఓలారీ ప్రమాదవశాత్తు పక్కనే వెళ్తున్న రెండు కార్లపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీలోని కట్టె మొదులు, తుంగలతో సహా కార్లపై పడడం కార్లు నుజ్జునుజ్జుగా మరాయి. అదృష్టం కొద్ది కార్లలో ప్రయాణిస్తున్న వ్యక్తులు సకాలంలో స్పందించి కార్లలో నుంచి బయటకు దిగిపోవడంతో స్వల్ప గాయాలతో బతికి బయటపడ్డారు. కార్లలో ప్రయాణిస్తున్న వ్యక్తులు రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మున్సిపాలిటీ బుల్కాపూర్ చెందిన శ్రీనివాస్‌గౌడ్ కుటుంబ సభ్యులు కాగా మరో కారులో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. శ్రీనివాస్‌గౌడ్‌కు భార్య అరుణకు స్వల్ప గాయాలుకాగా, ఇద్దరు కుమారులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. కాగా అదే సమయంలో జహీరాబాద్ పర్యటనకు అటుగా వెళ్లన్న మాజీ మంత్రి హరీశ్‌రావు మానవత్వం చాటారు. కార్లలో ఇరుక్కుపోయిన వారిని బయటకు లాగి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.



కార్లపై పడిన లారీ

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి

● న్యాయం చేయాలంటూ గ్రామస్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న కార్మికులు, గ్రామస్థులు



అశోక్ మృతదేహం

మాసాయిపేట, మే 4(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి చెందిన సంఘటన మాసాయిపేటలో ఆదివారం చోటు చేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. మాసాయిపేట మండలం పోతనపల్లి గ్రామానికి చెందిన తెల్లారి అశోక్ (30) జీఎంఆర్‌లో రోజువారీ కూలిగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం 10 గంటలకు జాతీయ రహదారిపై కూలి పనికి తోటి కార్మికులతో కలిసి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మాసాయిపేటలోని 44వ జాతీయ రహదారి బంగారమ్మ ఆలయం ఎదురుగా రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం అతడిని వేగంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇది చూసిన తోటి కార్మికులకు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. సమాచారం అందుకున్న కుటుంబీకులు అక్కడి చేరుకుని గుండెలవిసేలా రోదించడం పలువురిని కంటతడి పెట్టించింది. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ తోటి కార్మికులు, గ్రామస్థులు ఆందోళనకు దిగడంతో మూడు గంటలపాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జీఎంఆర్ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో ఉద్రిక్తత నెలకొన్నది. విషయం తెలుసుకున్న చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి, నార్సింగి, రామాయంపే, తూప్రాన్ పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అనంతరం జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు వచ్చి బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు

రేకులు వేస్తుండగా కింద పడి..



మృతిచెందిన నాగరాజు

చేగుంట, మే 4(ఆంధ్రజ్యోతి) ఇంటి పైకప్పుపై రేకులు వేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన చేగుంట మండలం వడియారం గ్రామంలో చోటు చేసుకుంది. చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన గూని నాగరాజు(34) చేగుంట మండల కేంద్రంలో ఓ ఇంటి నిర్మాణంలో భాగంగా పైకప్పు రేకులు వేయడానికి కూలికి వచ్చాడు. రేకులు వేస్తుండగా ప్రమాదవశాత్తు భవనం పై నుంచి జారిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని హైదరాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య లావణ్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. నాగరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

హార్వెస్టర్ కింద పడి బాలుడు..

● యజమాని ఇంటి వద్ద మృతదేహంతో ఆందోళన



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

చేగుంట మే 4 (ఆంధ్రజ్యోతి): హార్వెస్టర్ కింద పడి బాలుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం శాలిపేట గ్రామానికి చెందిన మాలే లావణ్య, రాజు తమ ఇద్దరు కుమారులతో కలిసి ఏప్రిల్ 30న తమ మేనమామ వివాహం కోసం ఇబ్రహీంపూర్ గ్రామానికి వచ్చారు. ఆదివారం వారి చిన్న కుమారుడు హర్షిత్(8) ఇంటి ఎదుట ఆడుకుంటుండగా వరి కోత మిషన్(హార్వెస్టర్) డ్రైవర్ గమనించకుండా రివర్స్ తీయడంతో బాలుడు దాని కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన హర్షిత్‌ను ఆస్పత్రి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు హార్వెస్టర్ యజమాని బెస్త అశోక్ ఇంటి ఎదుట బాలుడి మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేపట్టగా గ్రామ పెద్దలో సముదాయించారు. విషయం తెలుసుకున్న చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్‌రెడ్డి అక్కడికి చేరుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. బాలుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెల్లడించారు.

వడ్ల కుప్పలను ఢీ కొని వ్యక్తి..

హవేళిఘణపూర్, మే4 (ఆంధ్రజ్యోతి) : వడ్ల కుప్పలను ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని గాజిరెడ్డిపల్లి శివారులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం నడిమితండా గ్రామానికి చెందిన గుగులోతు రమేష్(40) దంపతులు ఆదివారం బైక్ పై మెదక్ వచ్చి తిరిగి తమ గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని గాజిరెడ్డిపల్లి శివారులో రోడ్డు పక్కన ఉన్న వడ్ల కుప్పను ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టు కోసం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు సురేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ..



సిద్దమ్మ మృతదేహం

న్యాల్‌కల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని హుస్సేన్‌నగర్‌లో ఆదివారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం హుస్సేన్‌నగర్‌కు చెందిన సిద్ధమ్మ(55) ఆదివారం ఉదయం ఇంటి ముందు ఉన్న బాతురూంలోకి వెళ్లి బయటకు వస్తుండగా పక్కనే ఉన్న ఇనుపరాడ్డును పట్టుకున్నది. ఆ రాడ్డుకు అప్పటికే విద్యుత్ వైరు ఆనుకుని ఉండడంతో షాక్ తగిలి తీవ్ర గాయాలపాలైంది. దీంతో ఆమెను చికిత్సనిమిత్తం బీదర్‌కు తీసుకెవెళ్తుండగా మార్యమధ్యలో మృతి చెందింది. మృతురాలి కుమారుడు వడగామ సంజీవ్ ఫిర్యాధు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు అవగాహన సదస్సు

హుస్నాబాద్‌రూరల్‌, మే 4 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్‌ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం ఉదయం 9 గంటలకు ఖరీఫ్‌ పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏఈవో స్వామి తెలిపారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే అంశంపై వివిధ పంటలపై రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు మండలంలోని రైతులు హుస్నాబాద్‌ మార్కెట్‌ యార్డులో నిర్వహించే సదస్సుకు హాజరు కావాలని కోరారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కుకునూరుపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి మండల కేంద్రంలో రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులను సోమవారం పంపిణీ చేయనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. 60 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

కేజీబీవీలో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తొగుట, మే 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఆసక్తి గల విద్యార్థినులు మే 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల స్పెషలాఫీసర్‌ భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్‌ కార్డు జిరాక్స్‌, 5వతరగతి బోనఫైడ్‌, బ్యాంక్‌ అకౌంట్‌ జిరాక్స్‌, రెండు పాస్‌పోర్టు సైజ్‌ ఫొటోలు జతచేసి పాఠశాలలో అందజేయాలని పేర్కొన్నారు. ఎంపికైనవారి వివరాలు జూన్‌ 5వ తేదీన పాఠశాలల నోటీసు బోర్డుపై డిస్‌ప్లే చేస్తామన్నారు. పూర్తి వివరాలకు 77023 79220 నెంబర్‌కు ఫోన్‌లో సంప్రదించాలని కోరారు.

హుస్నాబాద్‌ మార్కెట్‌ వైస్‌ చైర్మన్‌కు పలువురి పరామర్శ

హుస్నాబాద్‌రూరల్‌, మే 4 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్‌ మార్కెట్‌ కమిటీ వైస్‌చైర్మన్‌, మండల పార్టీ అధ్యక్షుడు బంక చందు మాతృమూర్తి బంక ఉప్పలవ్వ ఇటీవల మృతి చెందారు. దీంతో ఆదివారం పలు పార్టీల నాయకులు చందును పరామర్శించారు. పరామర్శించిన వారిలో జిల్లా పరిషత్‌ మాజీ చైర్మన్‌ రాయిరెడ్డి రాజారెడ్డి, మాజీ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ తిరుపతిరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్‌ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి రైతులకు గుర్తింపు కార్డు

జగదేవ్‌పూర్‌, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ సూచనల మేరకు రైతులకు రైతు గుర్తింపు కార్డు ఇవ్వనున్నట్టు మండల వ్యవసాయ అధికారి వసంతరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్‌ 5వ తేదీన ప్రారంభమై జూన్‌ 6వ తేదీ వరకు జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి వసంతరావు తెలిపారు. భూమి ఉన్న ప్రతీ రైతు తనకు ఉన్న భూములకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారాన్ని ఈ ఫార్మర్‌ రిజిస్ట్రీలో నమోదు చేయబడుతుందని పేర్కొన్నారు. రైతుల విశిష్ట సంఖ్యను పొందుటకు రైతు ఆధార్‌, భూయజమాన్య పాస్‌ పుస్తకం, ఆధార్‌కు లింక్‌ చేయబడిన మొబైల్‌ నెంబరు తీసుకొని సమీపంలోని వ్యవసాయ విస్తరణ అధికారిని లేదా మీసేవా కేంద్రాన్ని సంప్రదించి ఫార్మర్‌ ఐడీకి రిజిస్ట్రేషన్‌ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

సినిమా పోస్టర్‌ ఆవిష్కరణ

సిద్దిపేట కల్చరల్‌, మే 4 (ఆంధ్రజ్యోతి: ఎస్‌ఆర్‌ఎఫ్‌ క్రియేషన్స్‌ బ్యానర్‌లో నిర్మిస్తున్న మొదటి సినిమాకు సంబంధించిన పోస్టర్‌ను మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం ఆవిష్కరించారు. సినిమా కథానాయకుడిగా బాంబే శ్రీనివాస్‌, కథానాయికగా హరిక నటిస్తున్నారు. ఈ చిత్రానికి జహీర్‌ దర్శకత్వం వహిస్తున్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలోనే మంచి వేతన ఒప్పందాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లయ్య

గజ్వేల్‌, మే 4(ఆంధ్రజ్యోతి): రాణే పరిశ్రమ కార్మికసంఘం గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూని గెలిపించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు. గజ్వేల్‌ పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఆర్‌బీఎల్‌ యూనియన్‌ కార్యకర్తల సమావేశాన్ని దువ్వల భిక్షపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాణే పరిశ్రమలో సీఐటీయూ నాయకత్వంలో మంచి వేతన ఒప్పందాలను, సంక్షేమ పథకాలను అమలు చేసినట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా అన్ని కార్మిక సంఘాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు 20న దేశవ్యాప్త సమ్మె చేస్తే బీఎంఎస్‌ సంఘం మాత్రం కేంద్ర ప్రభుత్వానికి ఊడిగం చేస్తూ కార్మిక కోడ్‌లకు మద్దతు తెలుపుతోందన్నారు. సీఐటీయూకు బలమైన నాయకత్వం ఉందని కార్మికులందరూ వినియోగించుకుని 4వ సారి సీఐటీయూను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట యూనియన్‌ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌, ఉప ప్రధాన కార్యదర్శి బండ్ల స్వామి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌, మల్లయ్య, నర్సింలు, వెంకట్‌రావు, రవికుమార్‌, రంగారెడ్డి, యాదగిరి, రమేశ్‌ తదితరులున్నారు.

ఆధార్‌ మాదిరిగా 'భూధార్‌'

- ప్రత్యేకంగా రైతులకు గుర్తింపునకు ప్రత్యేక యాప్‌
- ఫార్మర్‌ రిజిస్ట్రీతో కేంద్రం కొత్త పథకం
- ఆధార్‌ తరహాలో సాగుదారులకు 11 అంకెల సంఖ్య
- నేటి నుంచి రైతువేదికల్లో నమోదు చేసేందుకు అధికారులు సిద్ధం



కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏఈవోలు, ఏవోలకు శిక్షణ ఇస్తున్న అధికారులు(ఫైల్‌)

సిద్దిపేట కలెక్టరేట్‌, మే 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతులకు ఆధార్‌తో సమానమైన ప్రత్యేక గుర్తింపు కార్డు అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు 'ఫార్మర్‌ రిజిస్ట్రీ' పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద ప్రతీ రైతుకు 11 అంకెల విశిష్ట సంఖ్య కేటాయించనున్నారు. జిల్లాలోని నిర్మించిన రైతు వేదికల్లో ఏఈవోల ద్వారా ఈ ప్రక్రియను అమలు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా అధికారులు ఏడీఏ పద్మ, ఏవో హరిణి పాల్గొన్న విషయం తెలిసిందే. వారు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏఈవోలు, ఏవోలకు శిక్షణ సైతం అందించారు.

కార్డులో రైతు వివరాలు

ఈ గుర్తింపు కార్డు రైతుల సమగ్ర వివరాలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకొస్తుంది. 11 అంకెల సంఖ్యతో రైతు పేరు, గ్రామం, భూమి వివరాలు, సారవంతం, పంటల అనుకూలత, బ్యాంకు రుణ అర్హత, సబ్సిడీలు, పీఎం కిసాన్‌ నిధులు, పంట నష్ట పరిహారం వంటి సమాచారం అందుబాటులో ఉంటుంది. ఇకపై రుణాల కోసం పట్టా పాస్‌బుక్‌, ఇతర పత్రాల అవసరం ఉండదు. కేవలం ఈ సంఖ్య చెబితే సరిపోతుంది.

ప్రత్యేక యాప్‌లో నమోదు

రైతులకు గుర్తింపు కార్డును ఇచ్చేందుకు వీలుగా ప్రత్యేక యాప్‌ ద్వారా పేర్లు నమోదు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేసేందుకు వీలుగా దేశ వ్యాప్తంగా ప్రత్యేక యాప్‌ ద్వారా ఆధార్‌ కార్డు మాదిరిగా రైతులకు ప్రత్యేక కోడ్‌ ఉండాలనే ఉద్దేశంతో సాగుదారుల సంఖ్యను ఇవ్వనున్నారు. ఈ ప్రత్యేక యాప్‌ లో రైతుల పేర్లు నమోదుతో పాటు ఆధార్‌తో లింక్‌ అయిన మొబైల్‌ నంబర్‌, ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్‌తో నమోదు కోసం వెళ్లాలి. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసిన తర్వాత, రైతు ఫోన్‌కు వచ్చే ఓటీపీ ఆధారంగా 11 అంకెల సంఖ్య కేటాయిస్తారు. ఈ పథకం పీఎం కిసాన్‌, పంట బీమా, యాంత్రీకరణ సబ్సిడీలను సులభతరం చేస్తుంది. రైతులు సమాచారంతో సిద్ధంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రతీ రైతు నమోదు చేయించుకోవాలి



పైఅధికారుల ఆదేశాల మేరకు ఫార్మర్‌ రిజిస్ట్రీ కార్యక్రమంలో భాగంగా ఏవోలకు, ఏఈవోలకు శిక్షణ పూర్తి చేశాం. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త యాప్‌లో రైతులు తమ వివరాలు కచ్చితంగా నమోదు చేయించుకోవాలి. ఈ నెల 5వ తేదీ నుంచి రైతుల వివరాలను యాప్‌లో నమోదు చేస్తాం. రైతు ఆధార్‌ కార్డుకు తప్పనిసరిగా మొబైల్‌ నంబర్‌ లింకు ఉండాలి.

- రాధిక , జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

మహ్మదాపూర్‌లో పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ



పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణ భూమిపూజలో అర్చకులు, గ్రామస్థులు

హుస్నాబాద్‌రూరల్‌, మే 4 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్‌ మండలం మహ్మదాపూర్‌ గ్రామంలో మదిరాజ్‌ల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి ఆదివారం భూమి పూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామంలోని గ్రామదేవతలకు జలాభిషేకం చేసి అర్చకుల ఆధ్వర్యంలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ముదిరాజ్‌ సంఘం కమిటీ అధ్యక్షుడు, కుల పెద్దలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సమన్వయంతో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకుందాం



గజ్వేల్‌లో నిర్వహించి సమావేశంలో బీజేపీ నాయకులు

గజ్వేల్‌, మే 4 (ఆంధ్రజ్యోతి): సమన్వయంతో పని చేస్తూ గజ్వేల్‌-ప్రజ్ఞాపూర్‌ మునిసిపాలిటీలో మెజార్టీలో స్థానాలు కైవసం చేసుకుందామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్‌ ముదిరాజ్‌ పిలుపునిచ్చారు. గజ్వేల్‌ పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో పట్టణ బీజేపీ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్‌ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన గజ్వేల్‌ పట్టణ బీజేపీ క్రియాశీల కార్యకర్తల సమావేశంలో ఆయన నియోజకవర్గ ప్రభారి సింగం సత్తయ్య, సీనియర్‌ నాయకులు యెల్లు రాంరెడ్డితో కలసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు శశిధర్‌, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్‌, జిల్లా కౌన్సిల్‌ సభ్యులు చెప్యాల వెంకట్‌రెడ్డి, మర్కంటి ఏగొండ, ఆలేటి సుమతి పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనకు భూమిపూజ



కాన్గల్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపనకు భూమిపూజ చేస్తున్న గ్రామస్థులు

తొగుట, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాన్గల్‌ గ్రామంలో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠాపన కోసం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొండాపూర్‌లో బొడ్రాయి ఉత్సవం



బొడ్రాయి ఉత్సవంలో ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, మే4(ఆంధ్రజ్యోతి): మిరుదొడ్డి మండలం కొండాపూర్‌ గ్రామంలో ఆదివారం బొడ్డురాయి ఉత్సవం, నల్లపోచమ్మ ఉత్సవంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు, పురోహితులు ఎమ్మెల్యేకు గ్రామంలో ఘనంగా స్వాగతం పలికి, ఊరేగింపుగా బొడ్డురాయి వద్దకు చేరుకుని పూజలు చేయించారు. అలాగే పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

వరదరాజస్వామి ఆలయానికి ఎయిర్‌ కండిషనర్‌ వితరణ

మర్కుక్‌, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలో వరదరాజ స్వామి ఆలయాన్ని దాతల సహాయంతో పునర్నిర్మాణం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎస్సెస్సీ 1984-85 బ్యాచ్‌కు చెందిన స్థానిక మిత్రబృందం ఆధ్వర్యంలో ఆలయ గర్భగుడిలోకి ఎయిర్‌ కండిషనర్‌ను విరాళంగా ఇచ్చారు. ఈ నెల 7, 8 వ తేదీల్లో జరిగే బ్రహ్మోత్సవాల్లో విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని, కార్యక్రమానికి చిన్నజీయర్‌ స్వామి విచ్చేయనున్నట్టు ఆలయ చైర్మన్‌ వేణుగోపాలకృష్ణ, వరదరాజ్‌పూర్‌ మాజీ సర్పంచ్‌ లక్కాకుల నరేష్‌ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తుమ్మ కృష్ణ, ఆలయ పురోహితులు, గ్రామ ప్రముఖులు తదితరులు ఉన్నారు.

బొబ్బాయిపల్లిలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ ప్రారంభం



ట్రాన్స్‌ఫార్మర్‌వద్ద కాంగ్రెస్‌ నాయకులతో నర్సారెడ్డి

కుకునూరుపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థులకు నెల రోజుల క్రితం ఇచ్చిన హామీని గజ్వేల్‌ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నెరవేర్చారు. ఆదివారం కుకునూరుపల్లి మండలం బొబ్బాయిపల్లి గ్రామంలో 100కేవీ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ని ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్‌ జెండాను ఎగురవేశారు. నెల రోజుల క్రితం బొబ్బాయిపల్లి గ్రామంలో సీసీ రోడ్ల శంకుస్థాపనకు వచ్చిన సందర్భంగా పలువురు గ్రామస్థులు తమ గ్రామంలో లో వోల్టేజ్‌ సమస్య తీవ్రంగా ఉందని నర్సారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఆయన నెల రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం బొబ్బాయిపల్లిలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన కాంగ్రెస్‌ నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయనను పలువురు గ్రామస్తులు, నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కొండపాక మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ శ్రీనివాస్‌రెడ్డి, వీరేశం, నరసింహాచారి, ఐలం యాదవ్‌, తూం మహేందర్‌, రెడ్డమైన రవీందర్‌, మిట్టపల్లి రుషి, ఇండ్ల కనకయ్య, కోల ఉపేందర్‌, సత్యం తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

గజ్వేల్‌ రూరల్‌, మే 4 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్‌ పట్టణంలోని ప్రగతి ఒకేషనల్‌ జూనియర్‌ కళాశాలలో ఎంఎస్‌ఎన్‌ ఫార్మా కంపెనీ, న్యూలాండ్‌ లాబోరేటరీ వారు నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. వివిధ కళాశాలల నుంచి దాదాపు 50 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు 5 రౌండ్ల ఇంటర్వ్యూలు నిర్వహించి మొత్తం 8 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులందరూ ప్రగతి ఒకేషనల్‌ జూనియర్‌ కళాశాలలో ఫార్మా టెక్నాలజీ గ్రూపు చదివిన వారు కావడం గమనార్హం. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్‌ అంబాదాస్‌, ప్రిన్సిపాల్‌ మట్టయ్య చౌదరి, అధ్యాపకులు అభినందించారు.

సాగర్‌లో చావుకేకలు

(5వ పేజీ తరువాయి)

ఇదే రిజర్వాయర్‌లో ఆత్మహత్యలు చేసుకున్నవారు కూడా లేకపోలేదు.

మొక్కుబడిగా సూచికలు..కెమెరాలు

రంగనాయకసాగర్‌ రిజర్వాయర్‌ వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు మొక్కుబడిగా కనిపిస్తున్నాయి. బోర్డులు ఉన్నచోటనే నీళ్లలో దిగుతున్నా వారించేవాళ్లు కరువయ్యారు. ఇక నిఘా వ్యవస్థ కోసం అమర్చిన సీసీ కెమెరాలు కానరాకుండా పోయాయి. పనిచేస్తున్న కెమెరాలపై పర్యవేక్షణ లేకపోయింది. ఇటు పోలీసులు, అటు ప్రైవేట్‌ సెక్యూరిటీ సిబ్బంది నిరంతరం ఉండకపోవడంతో పర్యాటకులు ఇష్టారాజ్యంగా నీళ్లలో దిగి తమ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. రాను రాను మరింతగా పర్యాటకులు పెరిగే అవకాశం ఉన్నందున ఇప్పటికైనా నిఘాపై ప్రత్యేక దృష్టి సారించాలి. లేదంటే ప్రాణగండం తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నీళ్లలో మొసళ్లు ఉన్నాయని హెచ్చరికలు చేసినా ఎవరూ పట్టించుకోకపోవడం కొసమెరుపు.





ప్రమాదాలు జరిగినా పట్టించుకోరా?

దుబ్బాక పట్టణంలోని పాత మంచినీళ్ల బావి వద్దగల ట్రాన్స్‌ఫార్మర్‌ ప్రమాదంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్‌ నుంచి వెళ్లే విద్యుత్‌వైర్ల కింద తుమ్మ చెట్లు ఏపుగా ఎదిగి ప్రమాదకరంగా మారాయి. వర్షం పడితే చాలు చెట్లకొమ్మలు ఊగి, వైర్లనుంచి నిప్పు రవ్వలు చిమ్ముతున్నాయి. అంతేగాక నీటి తేమతో చెట్లకు విద్యుత్‌షాక్‌ వస్తుంది దీంతో చెట్లను తాకిన మూగజీవాలు కూడా మృత్యువాతపడుతున్నాయి. స్థానికులు పలుసార్లు ఫిర్యాదు చేసినా విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్‌ శాఖాధికారులు స్పందించి ప్రమాదాలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- దుబ్బాక, మే 4(ఆంధ్రజ్యోతి)

తడిసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి



సిద్దిపేట మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, మే 4: అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని సిద్దిపేట సుడా మాజీ డైరెక్టర్‌ మచ్చ వేణుగోపాల్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. ఆదివారం సాయంత్రం సిద్దిపేట పట్టణంలో సిద్దిపేట మార్కెట్‌ యార్డులో తడిసిన ధ్యాన్యాన్ని యార్డు మాజీ డైరెక్టర్లతో కలిసి సిద్దిపేట సుడా మాజీ డైరెక్టర్‌ మచ్చ వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం పడి ధాన్యం తడిసి, రైతులు ఆందోళన పడుతుంటే కనీసం ఒక్క అధికారి వచ్చి చూసే పరిస్థితి లేదని మండిపడ్డారు. రైతుల ఇబ్బందులను మార్కెట్‌యార్డు నుంచే ఫోన్‌లో హరీశ్‌రావుకు వివరించినట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్‌, అడిషనల్‌ కలెక్టర్‌, పౌర సరఫరాల శాఖ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు.

ఆపరేషన్‌ కగార్‌ను నిలిపివేయాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌ పార్టీ మండల నాయకులు

సిద్దిపేట రూరల్‌,మే 4(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్‌ కగార్‌ పేరుతో అమాయకులైన ఆదివాసి బిడ్డలను పొట్టన పెట్టుకుంటున్న కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆపరేషన్‌ కగార్‌ను నిలిపివేయాలని బీఆర్‌ఎస్‌ పార్టీ మండల అధ్యక్షుడు కోనయ్యగారి ఎల్లయ్య ముదిరాజ్‌ కోరారు. ఆదివారం నారాయణరావుపేట మండల కేంద్రంలో మండల బీఆర్‌ఎస్‌ నాయకులతో కలిసి తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన తెలిపి విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చతీస్‌ఘడ్‌లో ఆపరేషన్‌ కగార్‌ పేరిటఅమాయకులైన ఆదివాసి బిడ్డలను మవోయిస్టుల నెపంతో చంపడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే అపరేషన్‌ కగార్‌ ను నిలిపివేసి వారితో శాంతి చర్చలు జరిపాలని, వారికి జీవన స్రవంతిలో కలిసేలా చేయాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో మాజీ ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ, మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు అంజనేయులు,సీనియర్‌ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులకు శాలువాలతో సన్మానించిన దృశ్యం

కొండపాక, మే 4 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో కొండపాక మండలం సిరిసినగండ్ల ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్దవిఠల్‌ తెలిపారు. పాఠశాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆదివారం శాలువాతో సత్కరించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల స్థాయిలో తమ పాఠశాలలో చదువుతున్న ఇరుకుల హేమ 554 సాధించి ప్రథమ స్థానం అన్నారు. అలాగే పాశం నక్షత్ర 550 మార్కులతో ద్వితీయ స్థానం, 531 మార్కులతో పుల్ల ఐశ్వర్య తృతీయ స్థానం సాధించినట్టు తెలిపారు. వీరితోపాటు ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు సత్కరించారు.

దళిత సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ



చేర్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న దళితసంఘాల నాయకులు

చేర్యాల, మే 4 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం వేచరేణి గ్రామశివారు ఎల్లదాసునగర్‌కాలనీకి చెందిన దళిత వ్యక్తిపై దాడికి పాల్పడినవారిని శిక్షించాలని కోరుతూ ఆదివారం పట్టణంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీ సెంటర్‌ నుంచి అంబేడ్కర్‌ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. నిందితులను శిక్షించి దాడుల ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో నాయకులు జేరిపోతుల పరవురాములు, బుట్టి సత్యనారాయణ, భూమిగారి రాజేందర్‌, రామగల్ల నరేశ్‌, బొట్ల శేఖర్‌, దేవదానం, దాసరి ప్రశాంత్‌, దర్శనం రమేశ్‌, బాలనర్సయ్య, ముస్త్యాల ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో పూర్వవిద్యార్థుల సందడి

చిన్నకోడూరు/కుకునూరుపల్లి/మిరుదొడ్డి, మే 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న ఎస్సెస్సీ పూర్వ విద్యార్థులు తమ బ్యాచ్‌లకు చెందిన మిత్రులతో ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలను ఘనంగా జరుపుకున్నారు. ఆత్మీయంగా పలకరించుకుంటూ పరస్పరం కుటుంబ యోగక్షేమాలను పంచుకున్నారు. రోజంతా ఆడిపాడి సందడి చేశారు. గురువులను శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు.



చిన్నకోడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువులతో ఎస్సెస్సీ 1999-2000 బ్యాచ్‌ పూర్వ విద్యార్థులు



కుకునూరుపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో ఎస్సెస్సీ 2000-2001 బ్యాచ్‌ పూర్వ విద్యార్థులతో ఎంఈవో, ఉపాధ్యాయ బృందం



మిరుదొడ్డి మండలం అల్వాల్‌(పెద్దచెప్యాల) గ్రామంలోని టీజీఆర్‌డబ్ల్యూఎస్‌ పాఠశాలలో ఎస్సెసీ 2006-2007 బ్యాచ్‌ పూర్వ విద్యార్థినులు